క్లుప్తంగా

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన



మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి అధ్యక్షతన ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మొవ్వ పీహెచ్‌సీ సెంటర్ డాక్టర్ భగవాన్, కుమార్ చల్లపల్లి ఎస్‌టీఎల్ ఎస్ సెంటర్ సూపర్‌వైజర్ పి.రాజేష్ విద్యార్థులకు క్షయవ్యాధి నివారణపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేర్ మంజుల, అధ్యాపకులు ఆర్ సత్యనారాయణమూర్తి, ప్రభుత్వ మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు పునాది



గుడివాడ టౌన్: ప్రతి వ్యక్తికీ తన భవిష్యత్‌కు పునాది పడేది విద్యార్థి దశలోనే అని వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు అన్నారు. సోమవారం కళాశాల ఆడిటోరియంలో జేఎన్‌టీయూ కాకినాడ వారి ఆదేశాల మేరకు బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, కార్యదక్షత, ఓర్పు, నిశిత పరిశీలన, ధైర్యం, క్రమశిక్షణ ఉంటే విద్యార్థులు విద్యను నేర్చుకోవడంలోనూ భవిష్యత్‌లో విధి నిర్వహణలోనూ ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. నిష్ణాతులైన అధ్యాపకుల ఆధ్వర్యంలో బోధనలు జరుగుతున్నాయని, వాటిని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు దరఖాస్తులు



గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక పనిచేస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్మోహనరావుకు అభినందనలు



గుడ్లవల్లేరు: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిన మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత హైస్కూల్ హెచ్‌ఎం, ఎంఈఓ-1 జి.జగన్మోహనరావుతో పాటు ఉపాధ్యాయులను సోమవారం పలువురు అభినందనల వెల్లువతో ముంచెత్తారు. జగన్మోహనరావును ఎంఈఓ-2 జి.గోపాలరావు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

ముగిసిన కుంకుమ పూజలు



పమిడిముక్కల: మండలంలోని మంటాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో చేపట్టిన శ్రావణమాస కుంకుమ పూజలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల ఒకటి నుంచి సోమవారం వరకూ శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి 18 రోజులు పాటు కుంకుమ పూజా మహోత్సవాలు జరిపించారు. చివరి రోజైన సోమవారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని కుంకుమ పూజలు చేయించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హరిదుర్గా నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

వర్షంతో స్తంభించిన జనజీవనం

ముదినేపల్లి రూరల్: అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా ఆదివారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు కాలనీలు నీటమునగడంతో పాటు వరిచేలు ముంపు బారిన పడ్డాయి. ముదినేపల్లి ప్రధాన సెంటర్లో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున వర్షానికి రహదారి చిత్తడిగా మారింది. వర్షం కారణంగా వ్యాపారాలు లేక చిరువ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల వల్ల ముదినేపల్లి బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు. గుడివాడ వెళ్లే మార్గంలో మల్లాయపాలెం రైల్వేగేటు పనులు జరుగుతున్నందున వాహనాలను స్థానిక గురజ రోడ్డు నుంచి గుడ్లవల్లేరు మీదుగా గుడివాడ వైపు మళ్లించారు. వర్షానికి పల్లపు ప్రాంతాల కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముదినేపల్లి శివారు అన్నవరం, సింగరాయపాలెం జగనన్న కాలనీలతో పాటు శ్రీహరిపురం బీసీ కాలనీ, పెయ్యేరు వైఎస్సార్ కాలనీలోకి నీరు చేరి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. మండలంలోని ముదినేపల్లి, దేవపూడి, వాడవల్లి గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరిచేలు ముంపు బారిన పడ్డాయి. డ్రెయిన్లు సక్రమంగా ప్రవహించకపోవడంతో పొలాల్లో నీరు కదలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెనమకూరు వద్ద స్తంభించిన రాకపోకలు

పమిడిముక్కల: పెనమకూరు వంతెన వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన నిర్మాణంలో మట్టి దిబ్బ ఒక్కసారిగా కూలిపోవటంతో పెనమకూరు నుంచి పరిసరాల్లో ఉన్న 15 గ్రామాలకు వెళ్లే రాకపోకలు స్తంభించాయి. పెనమకూరు గ్రామానికి రావాలంటే తోట్లవల్లూరు లేదా, ఫతేలంక మీదుగా రాకపోకలు సాగించాల్సి రావటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.



అన్నవరం జగనన్న కాలనీలో నిలిచిన వర్షం నీరు



ముదినేపల్లి సమీపంలో నీటమునిగిన వరి చేలు



కూలిన మట్టి దిబ్బల ప్రదేశం

కొల్లేటి వాసుల ఆందోళన

మండవల్లి: కొల్లేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలు కూడా తోడవడంతో కొల్లేటి లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మణుగునూరు, చింతపాడు, పులపర్రు, కొవ్వాడలంక, తక్కెళ్లపాడు గ్రామాల్లోకి వరద నీరు చేరే ప్రమాదం ఉంది. పెనుమాకలంక పెదయెడ్లగాడి రహదారి నీట మునిగిన కారణంగా నందిగామలంక, ఇంగిలిపాకలంక, పెనుమాకలంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు, కైకలూరు వంటి పట్టణాలకు వెళ్లేందుకు ఇది దగ్గర దారి అయినందున వారంతా ఇటువైపు ప్రయాణిస్తుంటారు.



కొల్లేటిలో పెరిగిన వరద నీరు



నీట మునిగిన పెనుమాకలంక-పెదయెడ్లగాడి రహదారి

సర్దార్ పాపన్నగౌడ్ పోరాట యోధుడు

ముదినేపల్లి రూరల్: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను పోరాట యోధుడిగా ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అభివర్ణించారు. స్థానిక సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సోమవారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ రాచరిక వ్యవస్థపై ఎదురు తిరిగి, గోల్కొండ కోటను జయించి శిస్తులను ఆపివేయించిన గొప్ప వ్యక్తిగా పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ ఒక కులానికి కాకుండా పేదలపక్షాన నిలిచిన వ్యక్తిగా కొనియాడారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెడన ఎంపీపీ అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, మర్రివాడ సుధాకరరెడ్డి, గంటా కోటేశ్వరరావు, మంగినేని బాబ్జి, చిన్న, ఏసురాజు, రామకృష్ణ, కొండా తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదముత్తేవిలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై సోమవారం దాడి చేసినట్లు కూచిపూడి ఎస్ఐ కేఎన్.విశ్వనాథ్ తెలిపారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.4,200 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సర్వేలను వేగవంతం చేయండి

కలిదిండి(కైకలూరు): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని కలిదిండి ఎంపీడీఓ ఆర్.ఫణింద్ర పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అందించే సేవలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా అందించాలని తెలిపారు.

అధికారులకు సత్కారం

పెదపారుపూడి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు పొందిన ఎంపీడీఓ విమాదేవి, ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సత్కరించారు. ఎంపీపీ గోగం సురేష్ మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం నుంచి ఇద్దరు అధికారులకు అవార్డులు రావటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చైతన్యశ్రీనివాస్, సాగర రాణి, విజయ్ పాల్గొన్నారు.

70 ఎకరాల ఆదాయం సొసైటీకి పంపిణీ చేయాలి

మండవల్లి: ఉనికిలిలో 70 ఎకరాల భూమిపై వచ్చే ఆదాయం ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు 329 మందికి పంపిణీ చేయాలని సొసైటీ అధ్యక్షుడు కొలిపే రాంబాబు తదితరులు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ గతంలో 330 మంది లబ్ధిదారులు 70 ఎకరాల్లో వచ్చే ఆదాయాన్ని పంచుకుని జీవనం సాగించేవాళ్లమన్నారు. ప్రస్తుతం పట్టాలు ఉన్నవారికే ఆదాయం ఇస్తున్నట్లు తెలిపారు. కొల్లేరు ఆపరేషన్‌లో 76.14 ఎకరాల భూమిని సొసైటీకి అప్పగించారన్నారు. హైకోర్టులో ఉన్న ఆ భూమిని భూస్వాములు మళ్లీ తవ్వి ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు తెలిపారు.

హైవే రోడ్లపై లైట్లు వెలిగించాలని వినతి

పమిడిముక్కల: నేషనల్ హైవే రోడ్లపై పలుచోట్ల లైట్లు వెలగడం లేదని, సర్వీస్ రోడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మచిలీపట్నంలో సోమవారం జరిగిన సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గురజాడ నుంచి ఉయ్యూరు సర్వీస్ రోడ్ల మార్జిన్‌ల నిర్వహణ సరిగా లేవని, ఏడాదిగా వీధిలైట్లు వెలగడం లేదని తెలిపారు.

స్పందించిన కలెక్టర్..

శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన సమస్యపై కలెక్టర్ బాలాజీ స్పందించి అక్కడికక్కడే ఫోన్‌లో నేషనల్ హైవే అధికారులతో మాట్లాడారు. వీధిలైట్లు ఏర్పాటు చేసి తనకు చెప్పాలన్నారు. తానే వెళ్లి పరిశీలిస్తానని తెలిపారు. ఆర్టీఐ కార్యకర్తలు శివపార్వతి, దేవి పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా నిలుస్తాం

గుడివాడరూరల్: వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చి అన్నదాతలకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని బొమ్ములూరు పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో సోమవారం ఆయన మాట్లాడారు. కమిటీ చైర్మన్‌గా గుత్తా సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్లుగా అవ్వారు రాంపండు, మరిదినాగరాజుతో ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ తదితరులు పాల్గొన్నారు.

వర్గాలకు తావిచ్చే ప్రసక్తే లేదు

గుడ్లవల్లేరు: గుడివాడ నియోజకవర్గంలో వర్గాలకు తావిచ్చే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం మండలంలోని వడ్లమన్నాడు పి.ఎ.సి.ఎస్. కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము కమిటీ సభ్యులను అభినందించారు. పదవులు పొందిన వారు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కమిటీ చైర్మన్‌గా అడపా చంద్రశేఖర్, డైరెక్టర్లుగా మండ మురళి నాంచారయ్య, అబ్దుల్ జమీల్ బాధ్యతలు చేపట్టారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు బాపయ్య చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, మాజీ సర్పంచ్ కొడాలి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

మొవ్వ: మండల విద్యాశాఖ అధికారి-1గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అమ్ముల భానుప్రకాష్ (పూర్తి అదనపు బాధ్యతలు) సోమవారం తొలిసారిగా నిడమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల), కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షల పుస్తకాలను మూల్యాంకనాన్ని పరిశీలించి విద్యార్థులకు నూతన పరీక్ష విధానంపై అవగాహన కల్పించారు. అలాగే ఉపాధ్యాయుల ద్వారా, విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. నిడమోలు హైస్కూల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే ఆ పాఠశాలలో కొనసాగుతున్న బాలికల కళాశాల్లో రెండో యూనిట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు పాఠశాల హెచ్‌ఎం కాసాని అరుణ, అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, సీఆర్పీలు పంది కృష్ణార్జునరావు, తాతా సమర్పణ రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: అయ్యవారిరుద్రవరం ఎంపీపీ పాఠశాలను ఎంఈఓలు సురేష్, రత్నసునాదం సోమవారం పరిశీలించారు. ఇటీవల పాఠశాల్లో ఎఫ్ఏ-1 పరీక్షకు సంబంధించిన అసెస్‌మెంట్ బుక్‌లెట్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.



నిడుమోలు పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ



అయ్యవారిరుద్రవరం పాఠశాల్లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓలు

ఆరు రోజులుగా తాగునీరు లేక ఇక్కట్లు

పట్టించుకోని అధికారులు

గుడివాడరూరల్: ఆరు రోజులుగా తాగడానికి చుక్క నీరు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని సామాజిక కార్యకర్త అత్తలూరి రవికిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని లింగవరం పంచాయతీ కార్యాలయం వద్ద అధికారుల తీరుకు నిరసనగా రవికిరణ్ వినూత్న రీతిలో పకార్డు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి లింగవరంలోని బ్రహ్మారెడ్డి కాలనీలో తాగునీరు రావడం లేదన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తాగునీరు అందించాలని కోరారు.



లింగవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రవికిరణ్

శీతనపల్లి పీహెచ్‌సీకి రూ.3 లక్షలతో ఆర్వో ప్లాంట్

కైకలూరు: దాతల సాయంతో శీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.3 లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను ఎంపీపీ అడవి కృష్ణ సోమవారం ప్రారంభించారు. విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ అనుపమా, గ్రామస్తులు రమేష్ చంద్రా, విర్బాక్ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ ఫణీంద్రకుమార్, రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, ఏరియా మేనేజర్ సుబ్బారావు, విజయకృష్ణ పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ

ఆలయాల అభివృద్ధికి భక్తుల విరాళాల వెల్లువ

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల పునర్నిర్మాణ పనులకు విసనగిరి సన్యాసిరావు, చంద్రమ్మ దంపతుల స్మారకార్థం రూ.20వేలతో పాటు విసనగిరి అప్పలస్వామి స్మారకార్థం మనవడు పోతురాజు రూ.10వేల విరాళాలు ఇచ్చారు. వీటిని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. అలాగే శనగశెట్టి దుర్గాప్రసాద్ జ్ఞాపకార్థం కుమారుడు శేషుబాబు రూ.10,116 అందించారు. వల్లభనేని రామచంద్రరావు(బాబ్జి) స్మారకార్థం కుమారుడు వల్లభనేని కృష్ణ(యూఎస్ఏ) రూ.50వేలను అట్లూరి అమర్ ద్వారా అందించారు. కాశీపల్లి అనిల్‌కుమార్, నాగ షర్మిళ రూ.15,116 అందజేశారు. కాశీపల్లి సూర్యతేజ, విష్ణు వందన దంపతుల కుమార్తె లాస్యశ్రీ మాన్వి రూ.10,116 అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ల నాగేశ్వరరావు, చాపరాల సుధాకర్, ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, రవి పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. సోమవారం మూడో రోజు పోటీలను వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ కేవీఆర్ కిషోర్ ప్రారంభించారు. అనంతరం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన జట్ల మధ్య వాలీబాల్ పోటీలు జరిగాయి. మంగళవారంతో ఈ పోటీలు ముగుస్తాయని, వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేయనున్నట్లు కిషోర్ తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రామారావు, మీరా సాహెబ్, రాంబాబు, బాలా, చెన్నారావు, రవిప్రకాష్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తిరివీధి వెంకయ్య, టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, బీ కోటేశ్వరరావు, ఎండీ అలీ, ముక్కామల సుబ్బారావు, చల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఊరికి ఉపకారం.. సమాజ హితం

- పల్లె నుంచి తెలుగు రాష్ట్రాలకు ఎదిగిన మెయిల్ సేవలు
- నేడు డోకిపర్రులో పింక్ పవర్ రన్

గుడ్లవల్లేరు: ఊరికి ఉపకారం చేయాలనుకునే వారి సేవలు పల్లె ఎల్లలు దాటి తెలుగు రాష్ట్రాలకు విస్తరించాయి. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా ఆ సంస్థ అధినేతలు పురిటిపాటి కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు. అభివృద్ధితో పాటు ప్రజల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించటంలో భాగంగా మంగళవారం 'పింక్ పవర్ రన్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. డోకిపర్రులో మిస్ వరల్డ్ ఓపెల్ సుచాత చౌంగ్‌శ్రీ, మిస్ ఆసియా కృష్ణ గ్రవిడెస్‌తో ఈ కార్యక్రమాన్ని చేపట్టడమే కృష్ణారెడ్డి దంపతుల సేవలకు నిదర్శనం. గత ఏడాది హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ 'పింక్ పవర్ రన్ జరిగింది.

గ్రామాభివృద్ధి..

కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్ఆర్) కింద ఈ సంస్థ తమ స్వగ్రామం డోకిపర్రును దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తూ వస్తోంది. కృష్ణారెడ్డి, సుధారెడ్డి కుటుంబీకుల చేతుల మీదుగా గ్రామాన్ని అభివృద్ధి చేశారు. కొత్తగా గ్రామంలో తమ సొంత నిధులతో పంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఇంటింటికీ సురక్షిత మంచినీటి ట్యాప్‌లను ఏర్పాటు చేసి గ్రామంలో ఆరు వేల మందికి రూ.4కోట్ల సొంత నిధులతో మంచినీటి పథకాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలోని 1,500 గృహాలకు గ్యాస్ ఇచ్చేందుకు 20 కిలోమీటర్ల మేరకు పైపులైన్ల నిర్మాణం చేపట్టారు. ఒక్క వంట గ్యాస్ బండకు అయ్యే ఖర్చులో 40 శాతం ఖర్చు వినియోగదారునికి ఆదా అయ్యే విధంగా ఈ గ్యాస్‌ను పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం దశావతారాలతో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేయటంతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు వై.వి.సుబ్బారెడ్డి, సినీ హీరో చిరంజీవి, సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ మంత్రి కొడాలి నాని ఇక్కడికి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, క్షేమం కోసం ఎలాంటి సాయం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని, అందులో భాగంగానే మంగళవారం పింక్ పవర్ రన్‌ను నిర్వహిస్తున్నట్లు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు.



మంచినీటి పథకం



డోకిపర్రు 'వ్యూ'



కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులతో కలిసి పూజలు చేస్తున్న సినీ హీరో చిరంజీవి, సురేఖ దంపతులు (ఫైల్)